## చిట్టి కథ



# కొడుకు-కోడలు

పార్వతమ్మ గారికి ఎంతో ఆస్తి వుంది. ఒక కొడుకు, ఒక కూతురు. ఇద్దరికీ పెళ్ళిళ్ళు చేసి తన బాధ్యత తీర్చుకున్నారు. కొడుకూ, కోడలూ ఆవిడని ఎంతో ఆప్యాయంగా చూసుకుంటారు. ఆవిడకి రోజులు ఎంతో హాయిగా గడిచిపోతున్నాయి.

ఒక రోజు పార్వతమ్మగారు కొడుకును పిలిచి, "నాయనా! నేను పెద్దాన్నయిపోయాను. అంతేకాక గుండెజబ్బు, బీపీ కూడా వున్నాయి. ఎప్పుడు ఏమవుతానో తెలియదు. లాయరుగారిని పిలిపిస్తే ఆస్తంతా నీ పేర్న రాస్తాను. అప్పుడు నా మనసు తేలిక పడుతుంది" అన్నారు.

అది వినగానే కొడుకు "అవేం మాటలమ్మా! ఇప్పుడు వీలునామా రాయాల్సినంత పనేం వచ్చింది" అన్నాడు ఎంతో బాధగా.

"అదేంటండీ! అత్తయ్య గారు పెద్దవారు. ఎంతోదూరం ఆలోచించి చెప్పారు. ఆవిడకంటే మీకు ఎక్కువ ఏం తెలుసని, ఆవిడ చెప్పినట్లు చేయండి," అంటూ అత్తగారికి వత్తాసు పలికింది కోడలు.

ఆ రోజు ఆస్తి కొడుకు పేర్న రాసి నిశ్చింతగా పడుకున్నారు పార్వతమ్మ గారు.

* * * * *

రోజులు గడుస్తున్నాయి. పార్వతమ్మగారు రానురాను మందులు తీసుకుంటేగాని బ్రతక లేని స్థితికి వచ్చారు. కొడుకూ, కోడలి ప్రవర్తనలో వచ్చిన మార్పును ఆవిడ గమనించక పోలేదు. అయినా సర్దుకుపోతూనే వున్నారు.

ఒకనాటి సాయంత్రం కొడుకు అప్పుడే ఆఫీసు నుంచి వచ్చాడు. పార్వతమ్మ గారు మందులు అయిపోయాయి తెమ్మని చెబుదామని కొడుకు గదిలోకి వెళ్ళబోయారు. అంతలో లోపలి నుండి తన ప్రస్తావన వినిపించడంతో గుమ్మంలోనే ఆగిపోయారు.

కోడలు గొంతు వినబడుతోంది. "ఇంకా ఎన్నాళ్ళు ఈవిడ మనల్ని చంపుకు తింటుందో? సరదాగా ఎక్కడికైనా వెళదామంటే ఈవిడ పుణ్యమా అని వీలులేకుండా పోయింది. మీరు ఎలాగైనా ప్రయత్నించి మెర్సీ కిల్లింగ్‌కి ఏ డాక్టరునైనా ఒప్పించండి. ఎంత డబ్బు అయినా ఫరవాలేదు. అటు ఆవిడకీ ఈ జబ్బుల నుండి విముక్తి కలుగుతుంది. మనకీ మందులకు డబ్బు తగలేయాల్సిన పని వుండదు. హాయిగా ఏ అడ్డూ లేకుండా మనమూ, మన పిల్లలూ సరదాగా ఉండచ్చు."

పుత్రరత్నం అంటున్నాడు "ఆ! అన్ని ప్రయత్నాలూ చేసాను. ఏ డాక్టరూ అందుకు సిద్ధంగా లేడు. ఎవరికైనా తెలిస్తే శిక్ష పడుతుందనీ, తన వల్ల కాదనీ అంటున్నారు."

ఇది విన్న కోడలు, "అయితే ఆ ముసలావిడ్ని హెూమ్ ఫర్‌ది ఏజెడ్‌లో చేర్పించండి. ఎవరేమనుకుంటే మనకెందుకు? ఆవిడకి మనమంటే పడట్లేదని చెప్పవచ్చులెండి" అంటోంది.

"ఆ! ఆ రిస్కులన్నీ తీసుకోవడమెందుకు? ఆలోచిస్తే నాకు ఒక ఉపాయం తడుతున్నది. మందుల వాడకం క్రమం తప్పితే ప్రమాద మని చెప్పాడుగదా డాక్టరు. అందుకని, అమ్మతో డాక్టరు ఇక మందులు వాడక్కరలేదన్నాడని చిన్న అబద్ధమాడితే సరి! ఏమంటావు?"

"ఆ! ఇది చాలా బాగుందండీ!"

ఈ సంభాషణంతా విన్న పార్వతమ్మగారికి ఇక మందులు తెమ్మని చెప్పవలసిన అవసరం కనిపించలేదు. కన్నీళ్ళతో తన గదిలోకి వెళ్ళి పడుకున్నారు.

మర్నాడు కోడలు "ఎప్పుడూ అందరికన్నా ముందు లేచే ఈవిడేమిటి? ఇంకా లేవలేదు" అని గొణుక్కుంటూ లేపుదామని ఆవిడ వంటిపై చేయి వేయగానే ఐస్‌లా చల్లగా తాకింది.

అంతే భయంతో పరుగెత్తుకెళ్ళి భర్తని పిలుచుకు వచ్చింది.

ఇంతలోనే ఎలా మరణించిందో అర్థంగాక చూస్తున్న కొడుకుకు టేబుల్‌పై వున్న నిద్రమాత్రల సీసా, దానికింద ఒక ఉత్తరం కనిపించాయి. వెంటనే ఆ కాగితాన్ని లాక్కుని చదివాడు. అందులో ఆవిడ ఇలా రాసింది,

"నా చావుకు ఎవరూ బాధ్యులుకారు. జీవితం మీద విరక్తితోనూ, నా జబ్బుల నుండి విముక్తి పొందాలనీ ఈవిధంగా చేసాను. నా ఆస్తి విషయంలో నా మనసు మార్చుకున్నాను. నా యావదాస్థీ. ఈ వూళ్లోని వృద్ధ శరణాలయానికి చెందేట్టు చూడవలసిందిగా నా లాయర్ని కోరుతున్నాను."

ఇద్దరూ మొహామొహాలు చూసుకున్నారు. ఆవిడకి అంత అకస్మాత్తుగా విరక్తి ఎందుకు కలిగిందో వారికి అర్థమయ్యింది.

తమ అడ్డు తొలగినందుకు ఆనందించాలో, పరోక్షంగా ఆవిద తమని చాచి కొట్టినందుకు ఏడవాలో వారికి అర్థం కాలేదు.

-ఐ. మాధవి
హైద్రాబాదు